కథానిక:

# సుభాషిణి

✻ శ్రీ గుంటుపల్లి రాధాకృష్ణమూర్తిగారు ✻

"ఇలా లోకం నోట నానటండేనికి రా, అబ్బాయ్? లేనిపోని స్నేహాలవల్ల అపవాదులలోనవటం ఎందుకు?" అమ్మ నయాన అనేది.

"అబ్బే, బాగాబ్రతికే యోగంలేదమ్మా. ఎవరి కర్మ కెవరుకర్తలు గనుక?...అమ్మో, యింతాదేనికి? అంత నీవు నేర్పిన విద్యే. నీవు పెట్టిన పెటకమే." మామ్మ తాతి యుగం మాట.

సంఘం ముక్కుమీద వ్రేలేట్టుకున్నది, ఈ నా అపూర్వ సంఘటనలకు. అపూర్వమైనా అసభ్యంకావు; అపూర్వమైనా అవినీతి అంతకన్నాకాదు. మరి ప్రపంచానికి ఎందుకు ఆశ్చర్యమో, ఎందుకు అసహ్యమో నా యెడదకు బోధపడక బెడదగా మారింది.

నే నొక కళాప్రియుణ్ణి-కళ అంటే నేనే—కళా, నేనూ భిన్నంకాదు. నామదిలో ఉండే కళాజ్యోతి పరాయి ఎదల్లోని కళాజ్యోతుల్ని తిలకించ గలుగుతుంది. నా కళాజ్యోతి వెలుగుకు యిప్పుడు మిణుకు పురుగులుకూడా అసుదే అయిన్నై. ఇప్పటికే ఆ అంతస్తేజం ఆరిపోవచ్చింది. కొందటిలో ఆరిపోయింది. వారి డెందకందరాల్లో గాఢాంధకారపు కాఱుచీకట్లు; వికృతాకృతుల వికటాట్టహాసాలు; విచార గ్రస్థమానస నిర్ముక్త భయార్తనాదాలు. కాని నా మానసంలో అఖండజ్యోతి వెలుగుపుంజాలు; అచ్చరల హృదయంగమమైన నృత్యాలు; కిన్నెరల పంచమస్వర గీతికలమంగళనినదాలు. నా హృదయం సర్వదా ఆనంద లహరిలో దొర్లుతుంటుంది. నా మానసం నిరంతరమూ సౌందర్యల హరిలో దొర్లుతుంటుంది.

ఆమె హృదయ కుహరంలో అపార కళాసంపద ఉన్నది. ఆమెలోకూడా ఒక అంతర్జ్యోతి అఖండజ్యోతిగా ప్రజ్వరిల్లుతున్నది. ఒండొరుల హృదయాలసమైక్యం, మానసాల సంయోగం—పూలత క్రొంగ్రొత్త కుసుమ సౌరభసౌభాగ్యాన్ని తీగొమ్మల చిగురుటాకులకివ్వదూ? మాలతీలతవం కొంత వఱకూ ముదిరీ ముదురని కొమ్మకు ఆలింగన భాగ్యాన్నిస్తుంది. అవి ఏవేవో మూగగేయాలుతాడుకుంటై. రేజీకటి నిశి నిశ్శబ్దంలో ఆ ఒండొరుల అధరస్పర్శల నిశ్శబ్దం—

లోకాపవాదుకు లోనవటండేనికా అని ఒక్కొక్కప్పుడు యోచించే వాడిని దీర్ఘంగా. సుభాషిణితో మాటాడక పోతేనేం?—అనే భావపుటల దుర్విషయ వీచికగా మనస్సును తాకింది. అనంత వినీలాకాశంలోని శరజ్జ్యోత్స్న పాలి పోయింది. కాని, అంతరంగంలో ఒక మిణుకు కాంతి గోచరించింది. దాన్ని ఊతగా తీసికొని శరజ్జ్యోత్స్నల గాఢాంధకారాన్ని ఎదుర్కొన్నా. "పన్నిన చీకటిశాపి వెల్గింప సన్నని దీపంబుసాలదే తలప?" నామట్టుకు నాకే తోచింది. నేను చేసేదాంట్లో అసభ్యతగానీ, అవినీతిగానీ ఏమీలేదని, అంతా అత్యుదాత్తమేనసీ, అంతాశ్లాఘ్యమేనసీ మనస్సాక్షినుడివింది. ధన్యోస్మి. నా జీవిత నాటకంలో నేనొక ధీరోదాత్తుడననే భావించి, గర్వించా.

చామన చాయ వర్ణంతో, తీర్చిన కనుముక్కు తీరుతో, తొంగి చూచేనవ యౌవనంతో, మాలిన్యంలేని సౌశీల్యంతో అలరారుతుందంటే అది పామరుడిశర్ణన. అది సామాన్యుడి వర్ణన.

అఖండ అంతర్గత కళాజ్యోతి ప్రకాశానికాలవాలమై, అనంతమూ, అమలము, విమలమూ అయిపారే ప్రేమ వాహినీ ప్రవాహానికి మార్గభూమి అయి చెన్నొందే మనసు కలది సుభాషిణి. పైబాహ్యంకాదు నన్నాకర్షించినది. అంతరంగం—అందులో దాచి ఉంచబడిన అమూల్యకళాసంపద. ఆ సుభాషిణి ఏరుకునే భావాలూ, కూర్చుకునే మాటలూ, వెలువరించే స్వనాలూ చెవులకు సొంపుగా, సోకుతై. ఆ

కోలతను చూచినప్పుడల్లా, ప్రపంచం అంతా సంగీతమేననీ, జీవితం తగిన నృత్యమనీ అనిపిస్తుంది. ఆ కంఠస్వనంలో తొణికిసలాడేమాధురీ, గాంభీర్యము ఆ పసిడిపలుకుల నిచయపు కూర్పూ, ఆ సంఘటన చిత్రనాళై చిత్రీ—ఆ సుదతిలోని కళామధురామృతాస్వాదనానికి నాలోని కళచాలదేమో?

“కళలో, కళలో అని మొత్తుకుంటావ్. ఏ మిత్రా యీ పిచ్చికళలూ నీవూనూ?”—అనేది సంఘం. నాలో యిమిడి ఉన్న సౌందర్యతృష్ణను వీరెఱుగరు. నా మనసులోని రూపలాలసతవీరికి అర్థంకాదు. నేను కళాప్రియుణ్ణి. కళారాధిని, సౌందర్యోపాసకుణ్ణి. నాహృది లోతులను కొలిచేదానికి ఒక అడుగుబద్దలేదు. నా మానసటుదాత్తత ఔన్నత్యాలను కొలవటానికి ఒక కొలతబద్దలేదు. నాలోని రూపలాలసత చుట్టూపెట్టని కోటగోడలుండటంవల్ల అవి వీరికి దృగ్గోచరంకావు. ఈశ్వరుడు వంటి వానికే యీ సౌందర్య తృష్ణ ఉండేది. ఈ రూపలాలసత పర్యవసానమే నటరాజ నృత్యమూ, రాధాకృష్ణుల విలాస విహారమూ.

మళ్లీ వఒకమాఱు అమ్మ హెచ్చరించింది యీ విషయాన్నిగూర్చి. “నువ్వు నూరు చెప్పు. వెయ్యిచెప్పు. నేను సుభాషిణితో మాటాడకుండా ఉండలేనే...ఆమె నా కొక లోకం. ఆమె మాటలు నా చెవుల్లో సోకుతుంటేనే గాని నేనుండలేనే...” అన్నా నేను కటీపిటీగా. అమ్మ మనసు నొచ్చిందేమో? ఒక పవిత్రభారతాంబ హృదయం నలిగిందేమో?—క్షమాపణవేడుకున్నాను, నచ్చజెప్పాను. తల్లి నమ్మింది. కానీ, లోకంనమ్మదు!

కోటిస్వర్గాలు మొలిపించే శక్తి సుభాషిణి వాక్కులో ఉన్నది. ఆ వెలది ప్రసంగం నా మనస్సును నానందధామంచేస్తుంది. అలాంటప్పుడు నేనెలా యీ బంధాలను త్రెంపుకోగలను?—అదీకాకున్నా స్త్రీయెదుటనిలచి నెయ్యంతో యెడదవిప్పి పురుషుడు భాషిస్తే నేం?—ప్రపంచంముందంజ వేయవలసినకాలమిది. వెనక్కి తిరిగి చూడటంకేవలం వెఱ్ఱితనం. నేను కళాప్రియుణ్ణి. కాబట్టి ప్రపంచానికంటే ముందడుగు నాది. నాహృదయంలో అంతర్గతమై ఉన్న అఖండజ్యోతి బహిర్గాఢాంధకారాన్ని పటాపంచలుచేసి, ఒక క్రొత్తపథాన్ని చూపుతుంది. ఈ అనంత పథకంలో సుభాషిణీ, నేనూ బాటసారులం. ఒకమాఱు సమైక్యం అయినాం. మఱి ఎడబాటుభయంలేదు. లోకంకాకుల మూక. ఈ ఒంటికంటిలోకానికి మేము వెఱవం.

నేటికీ నాకర్ణపుటాలకు సుభాషిణి వాగమృత ఝురుల విందే. సుభాషిణి సమక్షానలేకున్నా, పిల్లవాయువులు నా చెవుల్లో సుభాషిణి మధురగేయాలను ఊది, ఆనంద లహరిలో నన్ను ఓలలాడిస్తై. నాకిదే సంక్రాంతి. ఇదే ఉగాది. నా కిదేస్వర్గం.

★

## మా చందాదార్లకు

“ఆంధ్ర మహిళ” పత్రిక ప్రతి నెలా 1 వ తేదీకి వెలువడుచున్నది. సామాన్యంగా ప్రతినెలా 5 వ తేదీ నాటికి పత్రిక చందాదార్లకు అందు ఏర్పాట్లు చేయబడ్డాయి. అందువల్ల, 10 వ తేదీ నాటికి పత్రిక అందనిచో, వెంటనే మాకు తెలుపవలసినదని మా చందాదార్లను కోరుచున్నాము. తమ తమ ఊళ్లయందలి తపాలా ఆఫీసులలో గూడ పత్రికలు సవ్యముగా తమకు జేరునట్టి కట్టుదిట్టములను చేసికొనవలెనని హెచ్చరించుచున్నాము. ముఖ్యమైన సంచికలు తరచు చందాదార్లకు అందుటలేదని తెలియవచ్చుచున్నది గనుక యీ ప్రకటన యగత్యమైనది. ఏ పరిస్థితిలోనైనా, 10 వ తేదీకి పత్రిక అందనిచో వెంటనే “ఆంధ్ర మహిళ” కార్యాలయమునకు జాబు వ్రాసినచో వేరు పత్రిక పంపబడును.

—మేనేజరు